వివాదాల పరిష్కారంలో రాజీమార్గమే మేలు

- జిల్లా లీగల్‌సెల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ స్వప్నరాణి



మాట్లాడుతున్న లీగల్ సెల్ చైర్మన్ స్వప్నరాణి

జూలపల్లి: గ్రామాల్లో జరిగే వివాదాల పరిష్కారానికి రాజీమార్గమే ఇరువర్గాలకు మేలని జిల్లా లీగల్‌సెల్ సర్వీసెస్ ఆథారిటీ చైర్మన్ స్వప్నరాణి అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రజలు చిన్న వివాదాలకే కేసుల దాకా వెళ్లకుండా గ్రామస్థాయిలోనే పరిష్కరించుకునేందుకు రాజీమార్గం అవలంబించాలని సూచించారు. అనంతరం సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ మాట్లాడారు. ఈ నెల 8న కేసు పరిష్కారం కోసం లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కోర్టులో కేసులు ఉన్న ఇరువర్గాలు హాజరై రాజీ కుదుర్చుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, సెక్రటరీ జోగుల రమేశ్, ఏజీపీ దూడం ఆంజనేయులు, ఎస్‌ఐ సనత్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

అధికారికంగా శ్రీపాదరావు జయంతి ఉత్సవాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు


మంథనిలోని శ్రీపాదరావు విగ్రహం

మంథని: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్, మంథని మాజీ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఉత్సవాలను గతేడాది నుంచి అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రెండో సంవత్సరం అధికారికంగా జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మంథని నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శ్రీపాదరావు విగ్రహాలను ముస్తాబు చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, శాసన మండలి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పలువురు మంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభాధ్యక్షతన, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభా ప్రారంభోత్సవంతో కార్యక్రమం ప్రారంభానికి సంబంధించి షెడ్యూల్ విడుదల చేశారు.

అజాత శత్రువుగా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన శ్రీపాదరావు 1937లో జన్మించారు. న్యాయ విద్య అభ్యసించిన ఆయన ఎల్‌ఎల్‌బీలో బంగారు పతకాన్ని సాధించారు. సర్పంచ్, సమితి అధ్యక్షుడిగా పనిచేసి శాసనసభకు ఎన్నికయ్యారు. 1983, 1885, 1989లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. 1992–94 వరకు శాసనసభకు స్పీకర్‌గా సేవలందించారు. 1999 ఏప్రిల్ 13న మహాదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో శ్రీపాదరావు నక్సల్స్ చేతిలో హత్యకు గురయ్యారు. ఆయన మరణించి 26ఏళ్లు కావస్తున్నా ఈ ప్రాంత ప్రజలు ఆయనను మరువరు. బుచ్చి పంతులుగా పేరున్న శ్రీపాదరావును ఇప్పటికీ తలచుకుంటూనే ఉంటారు.

అభిమానుల్లో ఆనందం..

శ్రీపాదరావు జయంతి ఉత్సవాలను ప్రభుత్వం గతేడాది నుంచే అధికారికంగా నిర్వహిస్తోంది. దీంతో కాంగ్రెస్, ఆయన అభిమానుల్లో సంతోషం నింపింది. కాగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా పనిచేసిన సమయంలో రామగుండం నియోజకవర్గంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శ్రీపాద ఎల్లంపల్లిగా నామకరణం చేసి ఆయన సేవలను గౌరవించారు. 20ఏళ్ల తర్వాత ప్రభుత్వం శ్రీపాదుడి జయంతి ఉత్సవాలను మొదటిసారి అధికారికంగా నిర్వహించగా రెండోసారి ఆదివారం అధికారికంగా ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువుర్ని సన్మానించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అంతర్గాం ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని: అంతర్గాం ఎస్సై అనుసరిస్తున్న వ్యవహార శైలిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. శనివారం రామగుండం సీపీ కార్యాలయంలో సీపీ ఎం.శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి 27న అంతర్గాం జెడ్పీస్కూల్ పోలింగ్ కేంద్రంలో అంతర్గాం ఎస్సై వెంకటస్వామి అధికార కాంగ్రెస్ కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశ్యపూర్వకంగా వేధింపులకు గురిచేసి బూత్ ఏజెంట్లని వెళ్లగొట్టారన్నారు. గేటు బయట ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ రాజేందర్ కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరించి బీజేపీ నాయకులను అడ్డుకున్నారని విమర్శించారు. మండల అధ్యక్షుడు బోడకుంటి సుభాశ్, మిట్టపల్లి సతీశ్, గుండబోయిన భూమయ్య, సిలివేరు అంజి, మాడ అనిల్‌రెడ్డి, కందుల పోచం తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: ప్రైవేటు పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. మంథనిలోని మహాలక్ష్మీ గార్డెన్‌లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన కాకతీయ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం మంత్రిని సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ పెండ్రు రమ, పాఠశాల డైరెక్టర్ కిరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ అధికారులు (ఎంపీవోల సంఘం) రూపొందించిన క్యాలెండర్, డైరీని కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆవిష్కరించారు. మంథని డీఎల్‌పీవో సతీశ్‌కుమార్, ఎంపీవోలు అనిల్‌రెడ్డి, ఫయాజ్, సుదర్శన్, సమ్మిరెడ్డి, గోవర్ధన్, వేణుమాధవ్, కిరణ్, రమేశ్ ఉన్నారు.


జిల్లా కేంద్రంలోని ట్రినిటి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యాబోధనలో తమ సంస్థ అత్యున్నత ప్రమాణాలు పాటిస్తోందన్నారు. ఇప్పటికే వేలాది మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యకమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సంక్షిప్త వార్తలు

• యువకుడు ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గట్టెపల్లికి చెందిన హరీశ్(23)అనే యువకుడు శనివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హరీశ్ తల్లి ఇంటి పక్కన ఉండేవారికి డబ్బులిచ్చి రమ్మని చెప్పింది. అయితే ఆ డబ్బులతో హరీశ్ మద్యం తాగి రాగా తల్లి మందలించింది. దీంతో బయటకు వెళ్లి యువకుడు పురుగుల మందుతాగి కొంతసేపటికి వేరే వాళ్ల ఇంటికి వెళ్లాడు. కాగా వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్ నుంచి ఎలాంటి సమాచారం లేదు.

• హిందీ దివస్ పురస్కారం ప్రదానం

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన హిందీ పండిట్ ఉపాధ్యాయుడు సాదిక్‌పాషాకు పురస్కారం దక్కింది. విశ్వహిందీ దివస్ సందర్భంగా ఎన్టీపీసీ వారు నిర్వహించిన వ్యాసరచన, కథల, కావ్యరచన పోటీల్లో సాదిక్‌పాషా ప్రతిభ చూపారు. మానవ వనరుల విభాగ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌సిక్దర్, రాజభాషా చీఫ్ మేనేజర్ ఆదేశ్‌కుమార్ పాండే చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్నారు.

• బ్రాస్ బ్యాండ్ సంఘం మండల ఎన్నికలు

జూలపల్లి: బ్రాస్‌బ్యాండ్ మండల అసోసియేషన్ ఎన్నికలు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సాహెబుస్సేన్ అధ్యక్షతన జూలపల్లిలో ఏకగ్రీవంగా జరిగాయి. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎండీ సాహెబుస్సేన్, అధ్యక్షుడిగా ఎండీ షాబుద్దీన్, ఉపాధ్యక్షులుగా నర్సింగం, డి.లచ్చయ్య, కార్యదర్శిగా ఎండీ హుస్సేన్, సహాయ కార్యదర్శిగా భూమయ్య, రఫీ, కోశాధికారిగా ఎండీ రజ్జుబెల్లి, కార్యవర్గ సభ్యులుగా శంకరయ్య, బాబ్, నరసయ్య, ఎండీ మహ్మద్, రాజయ్య, మల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

• అమరులకు నివాళి

కమాన్‌పూర్: మాదిగ ఉద్యమ పోరాటంలో అమరులైన వారికి మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం నివాళి అర్పించారు. అమరుల చిత్రపటాలకు పూలమాల నివాళి అర్పించారు. కుక్క రవి, సిరిసిల్ల శంకర్, మల్యాల తిరుపతి, మల్లారపు అరుణ్, కుక్క చంద్రమౌళి, గడుక కృష్ణమూర్తి, గాండ్ల మోహన్, మచ్చగిరి రాము, నల్లవెల్లి శంకర్ పాల్గొన్నారు.

• ధర్మారం మండల కేంద్రంలో..

ధర్మారం: మండల కేంద్రంలో శనివారం మాదిగ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు మద్దునాల మల్లేశం, ప్రధాన కార్యదర్శి శాతరాజుల సుమన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, నాయకులు కాంపెల్లి చంద్రశేఖర్, లింగమూర్తి, నరేశ్, మధు, కుమ్మరి మల్లేశం, ఆకాశ్ పాల్గొన్నారు.

• మహిళా దినోత్సవం విజయవంతం చేయండి

రామగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 8న సెంటినరీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆర్జీ–3 ఏరియా సేవా అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి కోరారు. మండలంలోని సెంటినరీకాలనీ సేవాభవనంలో సేవా సభ్యులతో శనివారం మహిళా దినోత్సవంపై చర్చించారు. మార్చి 8న కమ్యూనిటి హాల్‌లో ఉదయం 10గంటలకు వేడుకలు ప్రారంభం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. సేవా సభ్యులు, సింగరేణి ఉద్యోగులు కుటుంబ మహిళలు, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి, కోఆర్డినేటింగ్ అధికారి పి.రాజేశం, సేవా కోఆర్డినేటర్ సుధాకర్, సేవా సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు ఉచిత వైద్యసేవలు

కోల్‌సిటీ: గోదావరిఖని హనుమాన్‌నగర్‌లో సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం శనివారం కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. సుమారు 130 మందికి ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేసినట్లు చేసినట్లు మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. కార్మిక కుటుంబాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతోనే కార్మిక క్షేత్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు వారు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు సెక్యూరిటీగార్డు ఉద్యోగం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు కల్పించినట్లు ఎఫ్‌ఆర్‌వో స్వర్ణలత, రామగుండం సీడీపీవో అలేఖ్య తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు అధికారులతో, ఎన్టీపీసీ రామగుండం అధికారులతో శనివారం ఎఫ్‌ఆర్‌వో, సీడీపీవో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు శివాణి(గోదావరిఖని), సంజన(ధర్మారం)కు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో వీడ్కోలు సమ్మేళనం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్

జూలపల్లి: మండ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేసిన నృత్యాలు అలరించాయి. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు


మాట్లాడుతున్న ఆడెపు శంకర్

రామగుండం: కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందని, అపరిష్కృతంగా ఉన్న భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం రాష్ట్ర నాయకుడు ఆడెపు శంకర్ కోరారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం స్థానికంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సమస్యలపై చర్చించారు. సమావేశంలో నాయకులు గూడూరి వైకుంఠం, గుమ్మడి వెంకన్న, కరీం, పిల్లి సమ్మయ్య, దొంతుల హన్మయ్య, భూమయ్య, రాజేశ్ ఉన్నారు.

పోతనకాలనీలోని కుక్కల తరలింపు



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ పోతనకాలనీ ఏరియాలోని కుక్కలను శనివారం మున్సిపల్ సిబ్బంది వ్యాన్‌లో రామగుండం తరలించారు. పోతనకాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో స్థానికులు డివిజన్ మాజీ కార్పొరేటర్ తాళ్ల అమృతరాజయ్య, నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సింగరేణి కార్మికులు విధులకు వేళ్లే సమయంలో రోడ్డుపై తిరుగుతున్న కుక్కలు వాహనాలను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. స్పందించిన కమిషనర్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కుక్కలను తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది కుక్కలను పట్టుకొని వ్యాన్‌లో రామగుండం తరలించారు. కుక్కలను తరలించిన సిబ్బందికి, కమిషనర్‌కు పోతనకాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మల్లికార్జునస్వామి నాగవెల్లి పట్నం

జూలపల్లి: మండల కేంద్రంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరావుల మల్లికార్జున స్వామి నాగవెల్లి పట్నాలు, బోనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం మహిళలు బోనాలతో శోభాయాత్ర వెళ్లి పట్నాలపై ప్రతిష్ఠించి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా స్వామి జీవిత చరిత్రను ఒగ్గు కళాకారులు కథగా ప్రదర్శిస్తారు. సాయంత్రం అగ్నిగుండాలలో నడిచి మల్లన్నస్వామి భక్తిని చాటేందుకు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అవసరమైన సదుపాయాలు సిద్ధం చేశారు.

ఓడెడ్‌లో టోల్‌గేట్ మూసివేత


టోల్‌గేట్ మూసివేయిస్తున్న పోలీసులు

ముత్తారం: మండలంలోని ఓడెడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మానేరు తాత్కాలిక మట్టి రోడ్డుపై టోల్‌గేట్‌ను శనివారం మంథని సీఐ రాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ మూసివేయించారు. రెండు జిల్లాల సరిహద్దు మానేరులో ఓడెడ్ సమీపంలో టోల్‌గేట్ ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు వాహనాదారుల వద్ద అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఓ వ్యక్తి హైకోర్టుకు వెళ్లాడు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు టోల్‌గేట్‌ను మూసివేయించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్, నిట్టూరు, పెద్దకల్వలతో పాటు పెద్దపల్లి, రంగంపల్లిలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి 9:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏఐటీయూసీలో చేరిక

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–1 సీహెచ్‌పీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు శనివారం ఏఐటీయూసీలో చేరారు. భాస్కర్‌రావుభవన్‌లో జరిగిన కార్యక్రమంలో యూనియన్‌లోకి ఆహ్వానించారు.

సింగరేణి వార్తలు

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: సింగరేణి కార్మికులు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాంను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల కోసం 250గజాల భూమి కేటాయింపు, రూ.30లక్షల వడ్డీలేని రుణాలు అందించాలన్నారు. విజిలెన్స్, మారుపేర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రామగుండం, శ్రీరాంపూర్, కొత్తగూడెంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలన్నారు. డిస్మిస్ అయిన ఉద్యోగులకు మరో అవకాశం కల్పించాలన్నారు. వారి వెంట యూనియన్ జనరల్ సెక్రటరీ వికాస్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.

కార్మిక వాడలకు నీటి సమస్య లేకుండా చూడాలి


పరిశీలిస్తున్న సివిల్ జీఎం, అధికారులు

గోదావరిఖని: కార్మిక వాడలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేట్ సివిల్ జీఎం సూర్యనారాయణ ఆదేశించారు. గోదావరి తీరంలోని ఇంటెక్ వెల్ వద్ద శనివారం మంచినీటి లభ్యతను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రానున్న వేసవి కాలంలో రీజియన్‌లోని అన్ని ఏరియాల్లో మంచినీటి సమస్య లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైతే గనుల నుంచి కార్మిక వాడలకు నీటి సరఫరా అనుసంధానం చేయాలన్నారు. గోదావరి నుండి నీటి సరఫరా తగ్గితే ప్రత్యామ్నాయంగా గనుల నుంచి నీటిని వాడుకోవాలన్నారు. ఆర్జీ–1 సివిల్ డీజీఎం వసంత్‌కుమార్, ఆర్జీ–2 డీజీఎం ధనుంజయ్, ఆర్జీ–2 డీజీఎం రాజేంద్రకుమార్ ఉన్నారు.

వందశాతం ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తాం


మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: ఈ ఆర్థిక సంవత్సరం ఏరియాలో వందశాతం ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తామని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరిలో 9.77లక్షల టన్నుల లక్ష్యానికిగాను 10.33లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల్లో 106శాతం సాధించినట్లు పేర్కొన్నారు. లక్ష్యాలు సాధించేందుకు 13.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. ప్రతీరోజు 47వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆయన ఆదేశించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకుల సమష్టి కృషితో వందశాతం ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక ఇన్సెంటివ్‌లను యాజమాన్యం రూపొందించిందన్నారు. గైర్హాజర్ లేకుండా ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందుకెళ్లాలని ఆయన సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా ప్రతీఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రాముడు, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సివిల్ డీజీఎం ధనుంజయ, ఫైనాన్స్ వెంకటరామచంద్ర పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యంగా పనిచేయాలి

గోదావరిఖని: రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యంగా పనిచేయాలని జీఎం లలిత్‌కుమార్ ఆదేశించారు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని గనుల్లో ఫిబ్రవరిలో 110శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు నెలవారీ ఉత్పత్తి లక్ష్యాల గురించి శనివారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఫిబ్రవరిలో 3.84లక్షల టన్నుల లక్ష్యానికిగాను 4.22లక్షల ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. ఉద్యోగులు, అధికారులు కలిసి రక్షణతో పనిచేసి అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించారని అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నాటికి 44.92లక్షల టన్నుల లక్ష్యానికిగాను 42.21లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 94శాతంలో నిలిచామన్నారు. ఈనెల 15న జీడీకే–11గనిలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. కార్మికులు కలిసికట్టుగా ముందుకు సాగి ఏరియా వార్షిక లక్ష్యాల సాధనలో ముందుండాలని ఆయన సూచించారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్‌కమిటీ వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో శనివారం సీఅండ్‌ఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించే వరకు జీవో నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఓపెన్‌కాస్టుల లో పనిచేసే డ్రైవర్లను వోల్వో ఆపరేటర్లుగా గుర్తించి హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓపెన్‌కాస్టులలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కొందరు కాంట్రాక్టర్లు టెండర్లో ఉన్న కార్మికుల కంటే అదనంగా కార్మికులను తీసుకొని వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ, కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షుడు బుర్ర తిరుపతి, సహాయ కార్యదర్శి అప్రోజఖాన్ ఉన్నారు.

ఆర్జీ–3లో 104శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: ఆర్జీ–3లో ఫిబ్రవరిలో 104 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు శనివారం ఆర్జీ–3 జీఎం నరేంద్రసుధాకర్‌రావు తెలిపారు. ఆర్జీ–3లో నిర్దేశించిన 5.44 లక్షల టన్నులకు గాను 5.64 లక్షల టన్నులు అనగా 104శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. నిర్దేశించిన ఓబీ మట్టి వెలికితీత 40.30 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 37.05 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 92శాతం మట్టి వెలికితీయడం, 5.92 లక్షల టన్నుల బొగ్గురవాణా చేసినట్లు పేర్కొన్నారు. గనుల వారీగా ఓసీపీ–1 గనికి నిర్దేశించిన 2.74 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.93 లక్షలు అనగా 107శాతం, ఓసీపీ–2 గనికి నిర్దేశించిన 2.70 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.70 లక్షల టన్నులు అనగా 100శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్‌లో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కార్మికులకు సూచించారు.

ఏపీఏ గనిలో..

ఏపీఏ గనిలో ఫిబ్రవరిలో 66శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కొలిపాక నాగేశ్వరరావు తెలిపారు. ఫిబ్రవరిలో నిర్దేశించిన 0.18 లక్షల టన్నులకు గాను 0.12 లక్షల టన్నులు అనగా 66శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 0.12 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. సింగరేణిలో బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరుతున్న వారు అధికారులు, సూపర్‌వైజర్ల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

రెండు క్వింటాళ్ల బియ్యం అందజేత

రామగుండం: మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ పరికిపండ్ల నరహరి జన్మదినం సందర్భంగా పట్టణంలోని తబితా ఆశ్రమానికి రెండు క్వింటాళ్ల సన్నబియ్యం అందించారు. మాజీ జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, బీజేపీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్, బోడకుంట సుభాశ్, గుండబోయిన భూమయ్య, తోటకూర కుమారస్వామి, ఆలయ ఫౌండేషన్ సభ్యుడు మధు, రమేశ్‌బాబు, వెంకటేశ్, నాగార్జున, నరేశ్, కుమార్ ఉన్నారు.